# కలం

kalamdaily.com

Follow on: Kalamtelugu

ప్రజల గళం...

శనివారం • 04-04-2026

పేజీలు: 3


360° SINGLE TOPIC

గల్ఫ్ – ఆయిల్




# హర్మూజ్‌కు ఆల్టర్నేట్‌గా పైప్‌లైన్!

## కొత్త మార్గాల అన్వేషణలో గల్ఫ్ కంట్రీస్



- అండర్‌గ్రౌండ్ ఆయిల్ పైప్‌లైన్ ప్రణాళికలు
- చమురు సప్లైకి ఆటంకం లేకుండా వ్యూహం
- ప్రతికూల పరిస్థితుల్లోనూ నిరంతర సరఫరా
- గతంలోనే సొంతంగా నిర్మించుకున్న సౌదీ

### హర్మూజ్‌పై ఇరాన్ ఆధిపత్యం!

హర్మూజ్ జలసంధి భౌగోళికంగా ఇరాన్ నియంత్రణకు దగ్గరగా ఉంటుంది. రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు ఈ మార్గం ద్వారా రవాణా అవుతుంది. ఈ ప్రాంతంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నావికా దళం మోహరించి ఉంటాయి. గతంలో పలుమార్లు ఇరాన్ "అవసరం అయితే హర్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తాం" అని హెచ్చరికలు చేసింది. అమెరికా ఆంక్షలకు ప్రతిస్పందనగా, ప్రాంతీయ రాజకీయ ఒత్తిడిని పెంచేందుకు, ఆయిల్ ధరలపై ప్రభావం చూపేందుకు ఇరాన్ ఇలా వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. హర్మూజ్‌ను పూర్తిగా మూసివేయడం ఇరాన్‌కు కూడా నష్టమనే వాదన కూడా ఉంది. ఎందుకంటే వారి సొంత ఎగుమతులపై కూడా దాని ప్రభావం పడుతుంది. అయితే.. హర్మూజ్‌ను మొత్తం మూసేసి తన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపాలని ఇరాన్ భావిస్తున్నది.

ఇరాన్ యుద్ధంతో గల్ఫ్ దేశాలు గుణపాఠాన్ని నేర్చుకున్నాయి. కేవలం హర్మూజ్‌మీద ఆధారపడితే కష్టమేనని రియలైజ్ అయ్యాయి. శాశ్వత ఏర్పాట్లు చేసుకోకుంటే ఎప్పటికైనా తిప్పలేనని గుర్తించాయి. యుద్ధంతో ఏ రకంగా సంబంధం లేకపోయినా నష్టపోయామన్న ఆవేదనలో పడ్డాయి. రెండు మూడు దేశాల మధ్య యుద్ధానికి బలిపశువులం అయ్యామనే నిర్వేదానికి గురయ్యాయి. పొరుగు దేశంలోని అనిశ్చితి, అశాంతి ప్రభావం ఇక మీద తమమీద పడొద్దని భావిస్తున్నాయి. అందుకే ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాయి. సొంతంగా భూగర్భంలోంచి పైప్‌లైన్ వేసుకోవాలని ఆలోచన చేశాయి. గల్ఫ్ ప్రాంతంలోని దేశాలన్నీ ఇదే తరహాలో ఆలోచించి సొంత ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ప్రతీ ఆయిల్ చుక్క విలువను డాలర్లలో లెక్కేసుకుంటున్నాయి. ప్రధాన ఆదాయ వనరైన ముడిచమురు విషయంలో పకడ్బందీ ప్లానింగ్ చేసుకుంటున్నాయి.

ఇరాన్ వార్‌తో నెలకొన్న సంక్షోభం అనేక దేశాల ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసింది. గ్యాస్, పెట్రోల్ కొరతతో వివిధ దేశాలు అల్లాడిపోతున్నాయి. ఆయిల్ ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న గల్ఫ్ దేశాలనూ యుద్ధం కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. హర్మూజ్ జలసంధిలో ఆంక్షలు రావడంతో ఆయిల్ ఎగుమతి నిలిచిపోయింది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని గల్ఫ్ దేశాలు తలలు పట్టుకున్నాయి. హర్మూజ్ మార్గం క్లోజ్ కావడంతో ఆయిల్ నిల్వలు పేరుకుపోయాయి. ఆదాయం భారీగా తగ్గిపోయింది. గల్ఫ్ దేశాలు క్రూడాయిల్, నేచురల్ గ్యాస్ అమ్మకాలతో ఏటా సమకూరే లక్షల కోట్ల రూపాయల ఆదాయం ఇబ్బందుల్లో పడింది. ఈ దేశాల్లోని సుమారు 80% క్రూడాయిల్, గ్యాస్ హర్మూజ్ మీదుగానే రవాణా అవుతుంది.

ఇలాంటి క్లిష్ట సమయాన్ని సౌదీ అరేబియా 1980లోనే ఎదుర్కొన్నది. అప్పట్లో జరిగిన ఇరాన్ యుద్ధంతో సొంతంగా పైప్‌లైన్ మార్గాన్ని నిర్మించుకున్నది. ఇరాన్‌లో సంక్షోభంతో హర్మూజ్ మీదుగా ఆయిల్ ఎగుమతి చేసే దేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెల రోజులు దాటినా సేమ్ సీన్. ఆల్టర్నేట్‌గా బెస్ట్ రూట్ కోసం అన్ని గల్ఫ్ దేశాలూ ఆలోచిస్తున్నాయి. పరస్పరం చర్చించుకుంటున్నాయి. ప్రస్తుతమున్న పైప్ లైన్ మార్గాల సామర్థ్యాన్ని పెంచుకోవడం, కొత్తగా రోడ్డు, రైల్వే మార్గాలను ఏర్పాటు చేసుకోవడం తదితరాలపై గల్ఫ్ దేశాలు ఫోకస్ పెట్టాయి. హర్మూజ్ శాశ్వతంగా మూతపడినా ఎగుమతులు, దిగుమతుల్లో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా రూట్లను డిజైన్ చేస్తున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే వాటికి బిగ్ రిలీఫ్ దొరుకుతుంది. 'హర్మూజ్ కు నో ఆల్టర్నేట్' అనే ప్రస్తుత భావన నుంచి 'హర్మూజ్ కు ఆల్టర్నేట్ ఉంది' అనే వైపు అడుగులు పడుతున్నాయి. ఈ రూట్లు ఎక్కడెక్కడున్నాయి? వాటితో కలిగే ప్రయోజనం ఏమిటి? తదితర అంశాలపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం...


- సెంట్రల్ డెస్క్, కలం




## హర్మూజ్ మూసివేతతో గల్ఫ్‌కు కష్టాలు

హర్మూజ్ జలసంధి తాత్కాలిక మూసివేతతో గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఒమన్, కువైట్, బహ్రెయిన్ దేశాలకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. వాటి ప్రధాన ఆదాయ వనరు ఆయిల్. ఆయా దేశాల్లో ఉత్పత్తి అయిన ఆయిల్ ఇతర దేశాలకు ఎగుమతి కావాలన్నా.. ఇతర దేశాల నుంచి నిత్యావసర వస్తువులు రావాలన్నా హర్మూజ్ ఒక్కటే మార్గం. నెల రోజుల నుంచి ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, ఇరాన్ బలగాలు ఆయిల్ షిప్పులను హర్మూజ్ గుండా కదలనివ్వకపోవడంతో గల్ఫ్ దేశాల్లో ఆయిల్ నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో 500 బిలియన్ బారెల్స్ ఆయిల్ నిల్వలు ఉన్నాయి. వీటి ఎక్స్ పోర్ట్ కష్టంగా మారడంతో హర్మూజ్ పై ఆధారాన్ని తగ్గించుకునేందుకు కొత్త మార్గాలు, కొత్త నెట్ వర్క్ లను గల్ఫ్ దేశాలు పరిశీలిస్తున్నాయి.

- ప్రస్తుతం ఎక్కువ ఆయిల్ హర్మూజ్ మీదుగా అరేబియా సముద్రం ద్వారా ఇతర దేశాలకు వెళ్తుంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ పై టెన్షన్ కంటిన్యూ అవుతున్నది. ఎప్పుడు.. ఎక్కడి నుంచి ఇరాన్ బలగాలు దాడి చేస్తాయో తెలియని అయోమయం. హర్మూజ్ లో ఎక్కువ భాగం ఇరాన్ ఆధీనంలోనే ఉండటంతో.. ఇజ్రాయెల్, అమెరికా తమపై చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఈ జలసంధిని ఇరాన్ వాడుకుంటున్నది. ఆయిల్ క్రైసిస్‌లోకి ప్రపంచాన్ని నెట్టేసింది. ఆయిల్ ఒక్కటే ప్రధాన ఆదాయంగా నడిచే గల్ఫ్ దేశాలకు ఇది కోలుకోలేని దెబ్బగా పరిణమించింది. దీంతో ఆల్టర్నేట్ కోసం ఆయా దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

# ప్రత్యామ్నాయ మార్గాలు ఇవీ..

### సౌదీ అరేబియా – ఈస్ట్ – వెస్ట్ పైప్‌లైన్

పర్షియన్ గల్ఫ్ నుంచి రెడ్ సీ తీరంలోని యాన్‌బు వరకు సుమారు 1,200 కిలో మీటర్ల పొడవైన ఈ పైప్‌లైన్ రోజుకు 50 లక్షల బారెల్స్ చమురు తరలిస్తుంది. 1980లో జరిగిన యుద్ధం టైమ్‌లోనే ఈ పైప్‌లైన్ నిర్మాణమైంది. ఇది హర్మూజ్‌ను పూర్తిగా బైపాస్ చేస్తుంది. దీన్ని 7లక్షల బారెల్స్ సప్లైకు విస్తరింపజేయాలని సౌదీ అరేబియా భావిస్తున్నది. దీని కోసం అదనంగా పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నది. సౌదీ నుంచి హర్మూజ్ జలసంధి ద్వారా చేసే మొత్తం ఎగుమతుల్లో సుమారు 60% నుంచి70% వరకు ఈ ఒక్క పైప్ లైన్ ద్వారానే బైపాస్ చేసే అవకాశం ఉంటుంది. యాన్‌బూ ఓడరేవు ఎర్ర సముద్ర తీరంలో ఉండటంతో సౌదీకి రెండు లాభాలు. ఒకటి సూయజ్ కాలువ ద్వారా యూరప్, అమెరికా దేశాలకు చమురు పంపొచ్చు. ఖర్చు కూడా తక్కువ. రెండోది.. పర్షియన్ గల్ఫ్‌లా కాకుండా, ఎర్ర సముద్ర మార్గం సౌదీ అరేబియాకు పూర్తి నియంత్రణలో ఉంటుంది. ఇది యుద్ధ సమయంలో సేఫ్ రూట్.

### అబుదాబి క్రూడ్ పైప్‌లైన్

హబ్షాన్ నుంచి ఫుజైరా వరకు సాగే ఈ పైప్‌లైన్ (360 కిలో మీటర్లు) రోజుకు 15 లక్షల బారెల్స్ సామర్థ్యం కలిగి ఉంది. ఫుజైరా హర్మూజ్ బయట ఉండటంతో ఇది కీలక మార్గంగా మారింది. దీని సామర్థ్యాన్ని 18 లక్షల బ్యారెల్స్‌కు పెంచే పనిలో అబుదాబి పడింది. ఫుజైరా వద్ద భూగర్భంలో భారీ చమురు నిల్వ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 4.2 కోట్ల బ్యారెళ్ల చమురును అత్యవసర పరిస్థితుల కోసం నిల్వ చేయొచ్చు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలకు పట్టే టైమ్, బీమా ఖర్చులు ఈ పైప్‌లైన్‌తో తగ్గుతాయి. ఫుజైరా ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు నిల్వ, బంకరింగ్ కేంద్రం.



### ఇరాక్–టర్కీ పైప్‌లైన్

ఇరాక్‌లోని కిర్కుక్ నుంచి టర్కీలోని సెహాన్ పోర్ట్ వరకు (970 కిలో మీటర్లు) సాగే ఈ మార్గం మధ్యధరా సముద్రం ద్వారా ఎగుమతులకు ఉపయోగపడుతుంది. అయితే, భద్రతా సమస్యలతో తరచూ అంతరాయం కలుగుతుంది. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ మార్గాన్ని క్లియర్ చేసుకోవాలని చూస్తున్నది. ఈ పైప్ ద్వారా యూరప్‌కు క్రూడాయిల్ సప్లై చేయొచ్చు. ఈ పైప్‌లైన్ రోజుకు సుమారు 6 లక్షల నుంచి 10 లక్షల బ్యారెళ్ల చమురును తరలించే సామర్థ్యం కలిగి ఉంది. ఇందులో 2 సమాంతర పైపులుంటాయి. ఒకటి 3.33 అడుగులు, మరొకటి 3.83 అడుగుల వ్యాసం. దశాబ్దాల కింద నిర్మించడంతో ఎప్పటికప్పుడు మరమ్మతులు అవసరమవుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత యూరప్ దేశాలు రష్యా చమురుపై ఆధారపడటం తగ్గించాయి. ఈ క్రమంలో ఇరాక్ నుంచి టర్కీ మీదుగా వచ్చే చమురు యూరప్‌కు అత్యంత చౌకైన, నమ్మకమైన ప్రత్యామ్నాయంగా మారింది. బ్యారెల్ ధర 111 డాలర్లు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 ఉన్న నేపథ్యంలో.. ఈ పైప్‌లైన్ ద్వారా జరిగే ప్రతి బ్యారెల్ ఎగుమతి ఇరాక్ ఖజానాకు రూ.10,500 అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నది.

### హదీతా–అకాబా పైప్‌లైన్

ఇది ఇరాక్‌లోని హదీతా నుంచి జోర్డాన్‌లోని అకాబా పోర్ట్ వరకు వెళ్లేలా ప్రతిపాదించిన పైప్‌లైన్. హదీతా నుంచి అకాబా మధ్య దూరం 1,154 కిలో మీటర్లు. రోజుకు 10 లక్షల బ్యారెళ్ల చమురును ట్రాన్స్ పోర్ట్ చేయడమే లక్ష్యం. తాజాగా ఇరాక్ తన చమురు ఎగుమతి కోసం ప్రధానంగా రెండు మార్గాలపై ఆధాపడుతున్నది. ఒకటి దక్షిణాన ఉన్న బస్రా పోర్ట్, రెండోది ఉత్తరాన ఉన్న సెహాన్ పోర్ట్. హర్మూజ్ వద్ద ఉద్రిక్తతల కారణంగా బస్రా ద్వారా ఆగిపోతున్న ఎగుమతులు. అందుకే ప్రత్యామ్నాయంగా ఎర్ర సముద్రం తీరానికి చేరుకునేందుకు ఈ పైప్‌లైన్ ప్రాజెక్ట్ కీలకం. ఈ పైప్‌లైన్ కేవలం ఇరాక్‌కే కాకుండా జోర్డాన్‌కు ఆదాయం తెచ్చిపెడ్తుంది. తన భూభాగం గుండా చమురు వెళ్తున్నందుకు జోర్డాన్‌కు ఫీజుల రూపంలో ఏటా కోట్లాది డాలర్లు వస్తాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాక్ తన పొరుగు దేశమైన జోర్డాన్‌కు తక్కువ ధరకే చమురు సరఫరా చేస్తుంది. ఇది జోర్డాన్ లోని ఇంధన సంక్షోభాన్ని తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.1.71 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా. రోజుకు 10 లక్షల బ్యారెళ్లు ఈ పైప్‌లైన్ ద్వారా ఎగుమతి చేస్తే.. రూ.1,054 కోట్ల ఆదాయం వస్తుంది.

# ఇజ్రాయెల్ మీదుగా యూరప్ రోడ్ వే

యూరప్ దేశాలకు గల్ఫ్ నుంచి భారీగా ఆయిల్ సరఫరా అవుతుంది. గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి దాటి అరేబియా సముద్రం మీదుగా సూయజ్ కాలువలోకి, ఆ తర్వాత యూరప్ దేశాలకు ఆయిల్ షిప్పులు వెళ్తుంటాయి. దీని దూరం దాదాపు 7,500 కిలో మీటర్లు. గల్ఫ్ నుంచి ఏ దేశానికి ఆయిల్ వెళ్లాలన్నా హర్మూజ్ ను దాటి ముందుకు పోవాల్సిందే. హర్మూజ్‌కు ఆల్టర్నేట్‌గా గల్ఫ్ దేశాలు రోడ్డు, రైల్వే మార్గం గుండా ఆయిల్‌ను యూరప్‌కు తరలించాలని ప్లాన్ చేస్తున్నాయి. సౌదీ వయా జోర్డాన్ మీదుగా ఇజ్రాయెల్‌కు సమీపంలోని మెడిటరేనియన్ (మధ్యధారా) సముద్రంలోకి ప్రవేశించేలా ప్రయత్నాలు చేస్తున్నాయి. అక్కడి నుంచి నేరుగా యూరప్‌లోకి వెళ్లేలా డిజైన్ చేస్తున్నాయి. ఇది ఎక్కువ భాగం భూమార్గం మీదుగానే వెళ్తుంది. దీంతో దూర భారం కూడా తగ్గుతుందని, 5 వేల కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని గల్ఫ్ దేశాలు అంచనా వేస్తున్నాయి. అయితే.. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి టైమ్ పడుతుంది. ప్రస్తుతం సౌదీ మీదుగా ఈస్ట్ వెస్ట్ పైప్‌లైన్ ఉన్నప్పటికీ అందులో నుంచి ఆయిల్ రవాణా అంతంతే ఉంటుంది.




## ప్రస్తుత సముద్ర మార్గం:

గల్ఫ్ → హర్మూజ్ → అరేబియా సముద్రం → సూయజ్ → యూరప్

**దూరం:** 7,500 కిలో మీటర్లు

హర్మూజ్‌పై ఉద్రిక్తత నేపథ్యంలో షిప్పుల రవాణాకు తీవ్ర ఆటంకాలు. గతంలో కూడా వార్ టైమ్‌లో ఇదే పరిస్థితి.

## కొత్త మార్గం:

గల్ఫ్ → సౌదీ → జోర్డాన్ → ఇజ్రాయెల్ (హైఫా పోర్ట్) → మధ్యధారా సముద్రం → యూరప్

- గల్ఫ్ నుంచి హైఫా వరకు (భూమార్గం): 3,000కిలో మీటర్లు.
- హైఫా నుంచి యూరప్ (సముద్రం): 2,500కిలో మీటర్లు.. అంటే రవాణా సమయం 40 శాతం వరకు ఆదా అవుతుంది.
- ఈ మార్గం ప్రస్తుతం ప్రతిపాదన స్థాయిలో ఉంది. ఇది కేవలం చమురుకే పరిమితం కాకుండా.. రైల్వే లైన్లు, విద్యుత్ కేబుళ్లు, హై స్పీడ్ డేటా కమ్యూనికేషన్ లైన్లను కూడా కలిగి ఉంటుంది.

## ఇజ్రాయెల్ హైఫా పోర్ట్ ద్వారా..

ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్ట్ అత్యంత కీలకం. గల్ఫ్ నుంచి రైలు లేదా పైప్‌లైన్ ద్వారా వచ్చే చమురు ఇక్కడ టెర్మినల్స్‌కు చేరుతుంది. అక్కడి నుంచి షిప్పుల ద్వారా గ్రీస్ లేదా ఇటలీ వంటి యూరప్ దేశాలకు చేరవేయడం చాలా ఈజీ. దీనివల్ల సూయజ్ కాల్వ వద్ద ఉండే రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు, భారీ ట్రాన్సిట్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదు. హైఫా పోర్ట్‌ను అరబ్ దేశాలతో కలపడానికి ట్రాన్స్‌అరేబియన్ రైల్వే ప్రాజెక్టుపై చర్చలు జరుగుతున్నాయి. చమురును పైప్‌లైన్‌ల ద్వారానే కాకుండా, ప్రత్యేక రకమైన రైలు వ్యాగన్ల ద్వారా కూడా రవాణా చేయవచ్చు. భారత్ చెందిన అదానీ గ్రూప్ ఈ హైఫా పోర్ట్ కొన్నది. దీంతో ఇండియా, గల్ఫ్, యూరప్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడతాయి. 7,500 కి.మీ నుంచి 5,000 కి.మీకు తగ్గడం వల్ల ఇంధన ఖర్చు, నౌకల నిర్వహణ ఖర్చు తగ్గుతాయి. హర్మూజ్ గుండా వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో ఇన్సూరెన్స్ ప్రీమియంలు కూడా తగ్గుతాయి.


## బ్రిడ్జ్ ఆఫ్ అర్డెంట్ – భూమార్గ వ్యూహం

సముద్ర మార్గంలో సముద్రపు దొంగల భయం, హర్మూజ్ లేదా బాబ్-ఎల్-మండేబ్ వంటి జలసంధుల వద్ద ఉండే యుద్ధ భయాలను పోగొట్టడానికి ఈ భూమార్గం ఒక సురక్షిత కవచం. యూఏఈలోని జెబెల్ అలీ పోర్ట్ నుంచి సౌదీ అరేబియా, జోర్డాన్ మీదుగా ఇజ్రాయెల్ ఓడరేవుల వరకు వేల సంఖ్యలో ట్రక్కుల ద్వారా ఆయిల్ రవాణా చేస్తున్నారు. సముద్ర మార్గంలో నౌకల ద్వారా వెళ్తే 15 నుంచి 20 రోజులు పట్టే ప్రయాణం, ఈ రోడ్డు మార్గం ద్వారా కేవలం 3 నుంచి 4 రోజుల్లోనే పూర్తవుతోంది. 7,500 కి.మీ నుంచి 5,000 కి.మీకు దూరం తగ్గడంతో ఇంధన ఆదా భారీగా ఉంటుంది. ఇది కేవలం చమురుకే కాదు.. ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల రవాణాకు కూడా ఒక ఎమర్జెన్సీ కారిడార్‌లా పనిచేస్తోంది. ఈ ల్యాండ్ బ్రిడ్జ్‌ను శాశ్వత ప్రాతిపదికన మార్చడానికి రైల్వేస్ ఫర్ రీజినల్ పీస్ అనే ప్రాజెక్టుపై పని చేస్తున్నారు. గల్ఫ్ దేశాలను ఇజ్రాయెల్‌తో కలిపే రైల్వే ట్రాక్ పూర్తయితే, ఒకేసారి వేల టన్నుల చమురును అతి తక్కువ ఖర్చుతో తరలించవచ్చు. ఇది ప్రపంచ వాణిజ్యంలో సూయజ్ కాల్వకు ఉన్న ఏకఛత్రాధిపత్యాన్ని సవాలు చేస్తుంది.

## గల్ఫ్ దేశాలకు రోజుకు వేల కోట్ల నష్టం

హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గల్ఫ్ దేశాలు ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నాయి. ఎడారి దేశాల సిరిసంపదలకు మూలాధారమైన క్రూడాయిల్ ఎగుమతులు నిలిచిపోవడంతో, ఆ దేశాలు ఎన్నడూ లేనివిధంగా ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ ముప్పును అవి కేవలం సవాలుగా మాత్రమే కాకుండా, చమురు లేని భవిష్యత్తు వైపు అడుగులు వేసే అవకాశంగా మార్చుకుంటున్నాయి.

- గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ), ఒపెక్ గణాంకాల ప్రకారం.. గల్ఫ్ దేశాలు క్రూడాయిల్, నేచురల్ గ్యాస్ విక్రయించగా ఏడాదికి వచ్చే ఆదాయం రూ.69.94 లక్షల కోట్లు .
- ఈ ఆదాయంలో రూ.21 లక్షల కోట్లతో సౌదీ అరేబియా టాప్ లో ఉంది. యూఏఈ రూ.12.92 లక్షల కోట్లు, ఇరాక్ రూ.11.50 లక్షల కోట్లు, కువైట్ రూ.10.07 లక్షల కోట్లు, ఖతార్ రూ.9.60 లక్షల కోట్లు, ఒమన్, ఇతర దేశాలు 4.85 లక్షల కోట్లు సంపాదిస్తుంటాయి.
- హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత వల్ల ఆయిల్ ఓడలు ముందుకు కదలక గల్ఫ్ కంట్రీస్‌కు లాస్ వస్తున్నది.




## గల్ఫ్.. ఫైనాన్షియల్ సర్వైవల్ స్ట్రాటజీస్

ప్రభుత్వ ప్రాజెక్టులపై వెచ్చించే నిధుల తగ్గింపు. విలాసవంతమైన ఖర్చులపై నియంత్రణ. అంతర్జాతీయ మార్కెట్లలో బాండ్లు రిలీజ్. విదేశీ పెట్టుబడులను అప్పుగా సేకరణ. గతంలో పన్నుల్లేని ఈ దేశాలు.. ఇప్పుడు వ్యాట్ ద్వారా స్థానిక ఆదాయంపై ఫోకస్. హర్మూజ్ జలసంధి సమస్యను అధిగమించడానికి ఆసియా దేశాలతో (ముఖ్యంగా చైనా, ఇండియా) డైరెక్ట్ పైప్‌లైన్ లేదా భూ మార్గాల ద్వారా వ్యాపారం పెంచుకునే దిశగా దీర్ఘకాలిక ఒప్పందాలపై దృష్టి.

## ఇండియా ఫోకస్ ఏమిటి?

హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పెరగడం భారతదేశానికి ఇంధన భద్రతపరంగా ఒక పెద్ద సవాలు. ఎందుకంటే భారత్ తన అవసరాలకు కావాల్సిన ముడి చమురులో దాదాపు 80% దిగుమతి చేసుకుంటుంది. అందులో మెజారిటీ వాటా గల్ఫ్ దేశాలదే. రెండేండ్లుగా భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా అవతరించింది. హర్మూజ్ సంక్షోభం తలెత్తితే.. రష్యా నుంచి దిగుమతులను మరింత పెంచుకుంటుంది. రష్యా చమురు నౌకలు నల్ల సముద్రం లేదా ఆర్కిటిక్ మార్గం ద్వారా వస్తాయి. వీటికి హర్మూజ్ జలసంధితో సంబంధం ఉండదు.

- అమెరికా నుంచి ముడి చమురు దిగుమతులను భారత్ ఇప్పటికే పెంచుతున్నది. అట్లాంటిక్ సముద్రం మీదుగా వచ్చే ఈ నౌకలు సురక్షితంగా చేరుతాయి.
- నైజీరియా, అంగోలా వంటి దేశాల నుంచి చమురు తీసుకోవడంతో రవాణా మార్గం సురక్షితంగా ఉంటుంది.
- దక్షిణ అమెరికా దేశాలు బ్రెజిల్, గయానా నుంచి కూడా చమురు దిగుమతులపై భారత్ దృష్టి సారించింది.

## గల్ఫ్ ఆలోచన.. ఇండియాకు ప్లస్

యూఏఈ (అబుదాబి క్రూడ్ పైప్‌లైన్) తన చమురును హర్మూజ్ జలసంధికి అవతల ఉన్న ఫుజైరా పోర్ట్‌కు చేరుస్తుంది. భారత్ నుంచి వెళ్లే చమురు నౌకలు హర్మూజ్ లోపలికి వెళ్లాల్సిన అవసరం లేకుండా, నేరుగా అరేబియా సముద్రంలోని ఫుజైరా వద్ద చమురును నింపుకుని తిరిగి రావచ్చు. దీనివల్ల యుద్ధ భయం, బీమా ఖర్చులు తగ్గుతాయి.

- సౌదీ అరేబియా తన చమురును ఎర్ర సముద్రం తీరంలోని యాన్‌బుకు పంపిస్తోంది. భారత్ తన నౌకలను ఎర్ర సముద్రం వైపు మళ్లించి అక్కడి నుంచి చమురును సేకరించవచ్చు.
- భవిష్యత్తులో భారత్-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ పూర్తయితే, భారత్ నుంచి వస్తువులు, చమురు ఉత్పత్తులు నేరుగా యూఏఈ మీదుగా భూమార్గంలో ఐరోపాకు వెళ్తాయి. అలాగే, తిరుగు ప్రయాణంలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తులను రైలు లేదా రోడ్డు మార్గం ద్వారా జెబెల్ అలీ పోర్ట్ వరకు తీసుకువచ్చి, అక్కడి నుంచి షిప్పుల ద్వారా కేవలం 2-3 రోజుల్లోనే ముంబై లేదా ముంద్రా పోర్ట్‌లకు చేర్చవచ్చు.